## క్లుప్తంగా

### విద్యార్థులకు ఉపకరణాల అందజేత



తునిలో విద్యార్థులకు ఆట వస్తువులు, కంప్యూటర్ అందజేస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

**తుని/తునిరూరల్:** విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని తుని, పాయకరావుపేట రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు కర్రి కిశోర్‌రెడ్డి ఆకాంక్షించారు. తుని మండలం సూరవరం ఎంజేపీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు గురువారం ఆయన ఆట వస్తువులు పంపిణీ చేశారు. పాఠశాలకు అవసరమైన విద్యుత్ దీపాలు, కంప్యూటర్లను డాక్టర్ నాగిరెడ్డి బహూకరించారు. కార్యక్రమంలో ఎంజేపీ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.విశ్వశాంతి, రెడ్డి సంక్షేమ సంఘం కోశాధికారి ఎం.వెంకటరెడ్డి, టి.నాగిరెడ్డి, కె.నారాయణరెడ్డి, ఎం.రాజారెడ్డి, ఎం.శివారెడ్డి, సతీష్‌రెడ్డి, సురేష్ రెడ్డి, కిరణ్ రెడ్డి, మణికంఠ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### రత్నగిరిపై గోవులకు టీకాలు



రత్నగిరిపై గోవులకు టీకాలు వేస్తున్న డాక్టర్లు

**అన్నవరం:** రత్నగిరిపై గోశాలలో గురువారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 188 గోవులకు సీజనల్ వ్యాధులు సోకకుండా టీకాలు వేయించినట్టు సంబంధిత విభాగం సూపరింటెండెంట్ ఐవీ రామారావు తెలిపారు. పశువైద్య సంచాలకులు డాక్టర్ పీతల మనోజ్‌కుమార్, శంఖవరం పశువైద్యాధికారి డాక్టర్ ప్రసాదరావు, అన్నవరం పశువైద్యశాల ఇన్‌చార్జి డాక్టర్ టి.లావణ్య గోవులకు వైద్య పరీక్షలు చేశారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నేతలు

**కిర్లంపూడి:** మండలంలోని సింహాద్రిపురం గ్రామానికి చెందిన పీతల సత్యనారాయణ కరెంట్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గత 10 సంవత్సరాలుగా మంచానికే పరిమితంకావడంతో కుటుంబ పోషణ కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న క్రాంతి ట్రస్ట్ చైర్మన్ బొడ్డేటి అప్పారావు గురువారం ట్రస్ట్ తరఫున 50 కేజీల బియ్యం, రూ.4 వేలు, నిత్యావసరాలను సమకూర్చారు. వీటిని ఎంపీటీసీలు అల్లు శివరామకృష్ణ, గోకాడ రాజా, స్థానిక నేత నంది గోవిందు గురువారం బాధిత కుటుంబానికి అందజేశారు.

### భద్రాచలానికి పాదయాత్ర



భద్రాచలం పాదయాత్రగా వెళుతున్న భక్తులు

**గోకవరం:** అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవంలో భాగంగా రాజానగరం మండలం భూపాలపట్నానికి చెందిన సుమారు 50 మంది భక్తులు పాదయాత్రగా భద్రాచలం ప్రయాణమయ్యారు. గురువారం తెల్లవారుజామున ప్రారంభమైన వీరి పాదయాత్ర సాయంత్రానికి గోకవరం మండలం చేరుకుంది. వీరికి వీరలంకపల్లిలోని రామకృష్ణాగార్డెన్స్‌లో ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామి స్వాగతం పలికారు. నాలుగు రోజుల పాటు పాదయాత్ర చేసి భద్రాచలం చేరుకుని సీతారాములను దర్శించుకుంటామని రామభక్తులు తెలిపారు.

### తహసీల్దార్‌కు మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతి



జి.బాలసుబ్రహ్మణ్యం

**తొండంగి:** ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం అధికారులను బదిలీ చేస్తోంది. దీనిలో భాగంగా స్థానిక తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా పదోన్నతిపై బదిలీ అయ్యారు. తుని, తొండంగి మండలాలకు తహసీల్దార్‌గా బాల సుబ్రహ్మణ్యం ఉత్తమసేవలందించారు. ఆయన పదోన్నతిపై బదిలీ కావడంతో గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు వీడ్కోలు సభ నిర్వహించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్, డిప్యూటీ తహసీల్దార్ అఖిల, ఆర్ఐ జి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధం సభకు తరలి రండి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల
- లింగంపర్తిలో పార్టీ శ్రేణులతో సమావేశం



లింగంపర్తిలో అనంతబాబు, వరుపుల సుబ్బారావును కలసిన పార్టీ నాయకులు

**ఏలేశ్వరం:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరులో ఈ నెల 3న నిర్వహించే సిద్ధం బహిరంగ సభకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని లింగంపర్తిలో గురువారం వరుపుల సుబ్బారావు ఇంటి వద్ద సిద్ధం సభ విజయవంతంపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏలూరులో నిర్వహించే సిద్ధం బహిరంగ సభకు వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పని చేయాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పార్టీ శ్రేణులు ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్, వరుపులను కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వరుపుల సూరిబాబు, శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతుల సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**'సిద్ధం' సభకు సమాయత్తం కండి**

**ప్రత్తిపాడు:** ఏలూరులో ఈ నెల 3న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే సిద్ధం బహిరంగ సభను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం సిద్ధం బహిరంగ సభ విజయవంతంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు ప్రతి గ్రామం నుంచి పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలన్నారు. సభకు వచ్చే పార్టీ శ్రేణులకు ఇబ్బందులు కలగకుండా నాయకులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, పార్టీ మాజీ మండల కన్వీనర్ బెహరా దొరబాబు, మాజీ సొసైటీ అధ్యక్షుడు జువ్వల చినబాబు ప్రసంగించారు. వైస్ ఎంపీపీ బంకు శ్రీను, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, పార్టీ నాయకులు రామిశెట్టి బులిరామకృష్ణ, కొంగన రాణీ కుమారస్వామి, బత్తుల నాగార్జున పాల్గొన్నారు.



ప్రత్తిపాడు సభలో మాట్లాడుతున్న వరుపుల సుబ్బారావు

### మంత్రి రాజాను కలసిన మున్సిపల్ కమిషనర్



తునిలో మంత్రి దాడిశెట్టి రాజాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరావు

**తుని:** మండలంలోని ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజాను తుని మున్సిపల్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకటరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి రాజాకు పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని సమస్యలు, అభివృద్ధిపై మంత్రి రాజాతో చర్చించారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని మంత్రి రాజా మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో మునిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలతకు వినతి పత్రం అందజేస్తున్న తోట నరసింహం

**గోకవరం:** గోకవరంలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలతకు వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ మాధవీలతను కలిసి వినతి పత్రం అందజేశారు. గోకవరం జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిన 800 మంది లబ్ధిదారులకు తంటికొండకు వెళ్లే మార్గంలో స్థలాలు మంజూరు చేయాలని, ప్రభుత్వానికి స్థలాలు ఇచ్చిన రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని, గోకవరంలో నివాసం ఉంటున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీ జనాభా ఓట్లు గోకవరం పంచాయతీలో నమోదు చేయాలని కోరారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యువనేత తోట రాంజీ, నాయకులు సుంకర వీరబాబు, మాజీ సర్పంచ్ దాసరి చినబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఎస్సీ సెల్ కార్యదర్శి వరసాల ప్రసాద్, అక్షింతల రాజా తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు సత్కారం



ప్రత్తిపాడులో తహసీల్దార్ గోపాలకృష్ణను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు

**ప్రత్తిపాడు:** ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ ఏలూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో గురువారం రాత్రి తహసీల్దార్ గోపాలకృష్ణకు పౌర సన్మానం జరిగింది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పంచాది వీరబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఇంజినీర్ మోహన్, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, వైఎస్సార్ కాంతిపథం ఏపీఎం వై వెంకట్, సొసైటీ అధ్యక్షుడు జి.సురేష్, ఏఎంసీ వైస్ చైర్మన్ శేరుకృష్ణ, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల జయశేఖర్, మామిడి నరసింహమూర్తి, న్యాయవాదులు, వివిధ శాఖల ఉద్యోగులు పూల మాలలు, శాలువా, మెమెంటోలతో తహసీల్దార్ గోపాలకృష్ణను సత్కరించారు.

## పార్టీ విజయానికి సమష్టిగా కృషి చేయాలి



వీరవరంలో తోట నరసింహాన్ని కలిసిన విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం

**కిర్లంపూడి:** వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ తోట నరసింహం సూచించారు. మండలంలోని గోనేడకు చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, రామకృష్ణాపురానికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం వీరవరంలో తోట నరసింహాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తోట నరసింహం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. కార్యక్రమంలో పలెకల గంగరాజు, దువ్వా బుజ్జి, చిత్ర నాగేశ్వరరావు, ఉరదాసు రాజు, చిలకమర్తి బాబీ తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం



తుని సాయినగర్‌లో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, నాయకులు

**తుని:** పట్టణ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. పట్టణంలోని 30వ వార్డులో గురువారం కౌన్సిలర్ సిద్ధిరెడ్డి గౌరి వనజ ఆధ్వర్యంలో రూ.15 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను గురువారం చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా సహకారంతో అన్ని ప్రాంతాలకు రోడ్లు, కాలువలు నిర్మిస్తునామన్నారు. ఏ ప్రభుత్వంలో అభివృద్ధి పనులు జరిగాయో ప్రజలు గమనించాలన్నారు. టీడీపీ నాయకుల మాయ మాటలను నమ్మితే ప్రజలకే నష్టం కలుగుతుందని హెచ్చరించారు. అనంతరం గణపతినగర్‌లో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న పార్కును పరిశీలించారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, పార్టీ తుని పట్టణశాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, యువజన విభాగం తుని పట్టణశాఖ అధ్యక్షుడు గొల్లపూడి బుచ్చిరాజు, దాసరి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

### బంగారు పతకం విజేతకు అభినందనలు





విజయలక్ష్మికి బంగారు పతకం అందజేస్తున్న గవర్నర్ నజీర్

**కిర్లంపూడి:** ఎంఎస్సీ మైక్రో బయోలజీలో అధిక మార్కులతో గోల్డ్ మెడల్ సాధించిన వీరంరెడ్డి విజయలక్ష్మిని గురువారం పలువురు అభినందించారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని గోనడకు చెందిన వీరంరెడ్డి అప్పలరాజు కుమార్తె వీరంరెడ్డి విజయలక్ష్మి కాకినాడ ప్రగతి పీజీ కాలేజ్‌లో ఎంఎస్సీ మైక్రోబయోలజీ చేసింది. 2022లో జరిగిన పిజీ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించింది. ఆది కవి నన్నయ్య యూనివర్సిటీలో బుధవారం నిర్వహించిన 15వ స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమెకు గోల్డ్‌మెడల్, పిజీ పట్టాను అందజేశారు. సర్పంచ్ అల్లు విజయకుమార్, ఎంపీటీసీ అల్లు శివ రామకృష్ణ, పలువురు గ్రామస్తులు విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు.

## ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



ఎంపీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీడీఓ మాధవి



శంఖవరం ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్



ప్రత్తిపాడు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న డేవిడ్‌రాజ్

**కోటనందూరు:** స్థానిక ఎంపీడీఓగా ఎస్.జయ మాధవి గురువారం బాధ్యతలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఎంపీడీఓగా పని చేస్తున్న జయమాధవి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ పశ్చిమగోదావరి జిల్లా తణుకుకు బదిలీపై వెళ్లారు. నూతన ఎంపీడీఓ మాధవికి ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఎంపీడీఓ జయ మాధవి ఎంపీపీ లగుడు శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.

**ఎంపీడీఓగా విజయ్‌కుమార్**

**శంఖవరం:** స్థానిక ఎంపీడీఓగా ఎం.విజయ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన జి.శివరామకృష్ణ పశ్చిమ గోదావరి జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన విజయ్‌కుమార్‌కు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రత్తిపాడు ఎంపీడీఓగా డేవిడ్‌రాజ్**

**ప్రత్తిపాడు:** ప్రత్తిపాడు ఎంపీడీఓగా ఎస్.డేవిడ్‌రాజ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన ఎంవీఆర్ కుమార్ బాబు కృష్ణాజిల్లాకు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా గోలుగొండ ఎంపీడీఓగా పనిచేసిన డేవిడ్‌రాజ్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీఓ డేవిడ్‌రాజ్‌కు ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి జె.శ్రీనివాసు, కార్యాలయ సిబ్బంది సురేష్, మూర్తి, రత్నం తదితరులు స్వాగతం పలికారు.

## రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరి

పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి



సూరంపాలెంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

**గండేపల్లి:** రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురవారం మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అతివేగం, అవగాహన లోపం కారణంగానే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాల్లో వెళ్లేటప్పుడు ప్రతిఒక్కరూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. రహదారులపై ముఖ్య కూడళ్లలో అదనంగా 2300 కెమెరాలు ఏర్పాటు చేస్తునట్టు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ మురళి కృష్ణ, పెద్దాపురం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.దుర్గావితల్, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, గండేపల్లి ఎస్సై ఎస్.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**హెల్మెట్‌ధారణపై అవగాహన**

**శంఖవరం:** ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కత్తిపూడి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్, అన్నవరం ఎస్సై కిషోర్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలంలోని కత్తిపూడిలో ప్రయాణికులకు గురువారం హెల్మెట్‌ధారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చే పదేళ్లలో 50 శాతం ప్రమాదాలు తగ్గించడమే లక్ష్యంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసు సిబ్బంది, కత్తిపూడి లారీ యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

### దాడిలో బ్లేడ్ బ్యాచ్ ప్రమేయం లేదు

- ఇన్‌చార్జి డీఎస్పీ కిశోర్‌కుమార్



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నార్త్‌జోన్ ఇన్‌చార్జి డీఎస్పీ కిశోర్‌కుమార్

**గోకవరం:** స్థానిక హోటల్‌లో వెయిటర్‌పై దాడి ఘటనలో బ్లేడ్ బ్యాచ్ ప్రమేయం లేదని నార్త్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్ తెలిపారు. గోకవరం పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామానికి చెందిన లక్ష్మీకల్యాణి ఫ్యామిలీ రెస్టారెంట్ వద్దకు గ్రామంలోని వెలమపేటకు చెందిన రొంగలి ఈశ్వరవీరగణేష్, పోసిన వీరభార్గవ్, తోట దీపక్ బిర్యానీ బుధవారం వెళ్లారు. ధర విషయంలో వీరికి, రెస్టారెంట్ సిబ్బంది ఘర్షణ చేలరేగ్గా డ్రింక్ బాటిల్ పగులగొట్టి వెయిటర్‌పై దాడికి పాల్పడ్డారన్నారు. ఇది బ్లేడ్ బ్యాచ్ చేసిన ఘటనగా పలు పత్రికల్లో కథనాలు ప్రచురితమైమయ్యాయన్నారు. ఈ ఘటన యాదృచ్ఛికంగా జరిగిందే తప్ప ముందస్తు ప్రణాళిక లేదన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. అనంతరం బాధితుడి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రంచన్‌గా పింఛన్



కాకినాడ ఆసుపత్రిలో సత్యనారాయణకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివశంకర్



తుని 21వ వార్డులో పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మహేష్

**తుని:** ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకతో లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్ అన్నారు. పట్టణంలోని 30 వార్డుల్లోనూ లబ్ధిదారులకు గురువారం వలంటీర్లతో కలిసి ప్రజాప్రతినిధులు పింఛన్లు పంపిణీ చేశారు. 21వ వార్డులో మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్ ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు రూ.3000 పింఛన్ల సొమ్మును అందజేశారు. పట్టణ పరిధిలో తొలిరోజు 6582 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టు కమిషనర్ వెంకట్రావు తెలిపారు. వలంటీర్లు తెల్లవారుజామునే తలుపుతట్టి పింఛన్లు అందించడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.


**కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత**

**ఏలేశ్వరం:** పట్టణంలోని 8వ వార్డుకు చెందిన మోరంపూడి సత్యనారాయణ అనారోగ్యానికి గురై కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతను పింఛను లబ్ధిదారుడు కావడంతో గ్రామ వలంటీర్ దేగల శివశంకర్ వైఎస్సార్ సీపీ నేత దేగల వెంకటరమణతో కలిసి కాకినాడ ఆసుపత్రికి వెళ్లి సత్యనారాయణకు పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## వైభవంగా రావులమ్మతల్లి సంబరాలు



సంబరాల్లో ఆకట్టుకున్న శక్తివేషాలు



హంస వాహనంపై అమ్మవారి ఊరేగింపు

**జగ్గంపేట:** గ్రామదేవత, స్థానిక మర్రిచెట్టు వద్ద వెలసిన రావులమ్మతల్లి సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏటా సంక్రాంతి నుంచి సుమారు 20 రోజుల పాటు అమ్మవారి సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా గత నెల 16 నుంచి అమ్మవారి సంబరాలను కన్నులపండువగా నిర్వహిస్తున్నారు. కాగా ఈ నెల నాల్గో తేదీతో సంబరాలు ముగియనున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం జగ్గంపేటలోని మర్రిముక్కవీధి, శెట్టిబలిజపేట, గెద్దపేట తదితర ప్రాంతాల్లో నిర్వహించిన వేషధారణలు, గరగల సంబరం, నృత్యాలు, పులివేషాలు చూపరులను ఆకట్టుకున్నాయి. గొల్లపేట, పద్మనాభనగర్ తదితర ప్రాంతాల్లో ఈ నెల 4వ తేదీలోపు సంబరాలను పూర్తి చేస్తారు. ఒక ప్రాంతానికి మించి మరో ప్రాంతంలో సంబరాలను పోటాపోటీగా నిర్వహిస్తున్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆలయం వద్ద ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**తుని:** విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మల నరికివేత, రోడ్డు క్రాసింగ్ పనుల కారణంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్ కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రత్నాలరావు గురువారం తెలిపారు. పట్టణ పరిధిలోని సాయినగర్, ఎంఆర్‌పేట, ఫైర్ ఆఫీసు రామాథియేటర్, గొల్లప్రొలరావు సెంటర్, నక్కిన వీధి, ఫిష్ మార్కెట్, గరువువీధి తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

## అయోధ్య, కాశీ యాత్రకు బస్సు సర్వీసు

**తుని:** భక్తుల కోరిక మేరకు తుని ఆర్టీసీ డిపో నుంచి అయోధ్య, కాశీ యాత్రకు బస్సు సర్వీసు నడుపుతున్నట్టు తుని డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు తుని డిపో నుంచి అయోధ్య, కాశీ యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు బయలు దేరుతుందన్నారు. టికెట్ ఒకొక్కరికీ రూ.12,500గా నిర్ణయించామన్నారు. ఈ యాత్రలో ప్రయాణికులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం ఉచితంగా అందజేస్తామన్నారు. తుని పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భక్తులు కోరుకున్న పుణ్యక్షేత్రాలకు ఎన్ని రోజులైనా బస్సు ఏర్పాటు చేస్తామన్నారు. వివరాలకు 73829 13216, 73829 13016, 73829 21904 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### ఎలుకల నివారణ మందు పంపిణీ

**గండేపల్లి:** దాళ్వా పంట సాగు చేస్తున్న రైతులకు ఉచితంగా సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద వ్యవసాయ, ఉద్యాన సహాయకులు రైతులకు ఎలుకల మందు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.